రైస్‌మిల్లర్ల దోపిడీపై విచారణ చేపట్టాలి

- సీఎంఆర్‌పై రైస్‌మిల్లుల్లో తనిఖీలు చేయాలి
- ఆటో డ్రైవర్లకు మేలు చేసే విషయాన్ని పరిశీలిస్తున్నాం
- విలేకరుల సమావేశంలో ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి

జగిత్యాల : విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి

జగిత్యాల, డిసెంబర్ 19, (నమస్తే తెలంగాణ) : రాష్ట్ర వ్యాప్తంగా కొన్నేండ్లుగా రైస్‌మిల్లర్ల దోపిడీ యథేచ్ఛగా కొనసాగుతూ వస్తున్నదని, దానిపై విచారణ చేపట్టాలని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, ఎమ్మెల్సీ టీ జీవన్‌రెడ్డి కోరారు. జగిత్యాలలో ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌తో కలిసి మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సీఎంఆర్ పేరిట రాష్ట్ర ప్రభుత్వం రైస్‌మిల్లర్లకు ధాన్యం ఇచ్చిందని, అయితే ఈ ధాన్యంలో అనేక రైస్‌మిల్లర్లు అనేక అవకతవకలకు పాల్పడ్డారని ఆరోపించారు. రాష్ట్ర వ్యాప్తంగా రైస్‌మిల్లర్ల వద్ద సెక్యూరిటీ లేకుండా ఇచ్చిన ధాన్యం విలువ రూ.20 వేల కోట్లకు పైగా ఉంటుందని, ఒక జగిత్యాల జిల్లాలోనే 3.52 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం రైస్‌మిల్లర్ల వద్ద ఉందన్నారు. సెక్యూరిటీ లేకుండా ఇచ్చిన ధాన్యాన్ని రైస్‌మిల్లర్లు తప్పుడు మార్గంలో విక్రయించుకుంటున్నారని మండిపడ్డారు. రాష్ట్రం, జిల్లాలో ఏ రైస్‌మిల్లులో తనిఖీ చేసినా, సీఎంఆర్ కింద ఇచ్చిన ధాన్యం నిల్వలు సగం సైతం ఉండవన్నారు. రైస్‌మిల్లర్లందరూ తప్పుడు పనులకు పాల్పడ్డారని, ఒక్కో రైస్‌మిల్లరు ఈ యేడాది రెండేండ్లలో కనీసం నాలుగు కోట్లు సంపాదించారని ఆరోపించారు. రైస్‌మిల్ పెట్టుబడి అంతా ఈ రెండేండ్లలోనే సంపాదించినట్టు కనిపిస్తుందన్నారు. ఈ విషయాన్ని సీఎం రేవంత్‌రెడ్డి, సంబంధిత శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లామని, పరిశీలన చేస్తారని చెప్పారు. తనతో పాటు ధర్మపురి ఎమ్మెల్యే, విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, కాంగ్రెస్ కోరుట్ల నియోజకవర్గ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావుతో కలిసి జగిత్యాల కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం ఇచ్చామని, రైస్‌మిల్లులో తనిఖీలు చేయాలని కోరినట్టు చెప్పారు. తనిఖీల్లో వ్యత్యాసాలు ఉంటే వారి వద్ద నుంచి ధాన్యాన్ని రికవరీ చేయడంతోపాటు రైస్ మిల్లర్లపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలన్నారు. అలాగే ల్యాండ్ మాఫియా, మైనింగ్ మాఫియాపై సైతం దృష్టి కేంద్రీకరించాలని అధికారులకు తెలియజేశామన్నారు.

ఆటో డ్రైవర్ల ఇబ్బంది గుర్తించాం

మహాలక్ష్మి పథకంతో మహిళలకు మేలు జరుగుతుందన్నదని, అదే సమయంలో ఆటో డ్రైవర్లకు కొంత ఇబ్బంది అవుతున్న విషయాన్ని ప్రభుత్వం గుర్తించిందని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి చెప్పారు. ఆటో డ్రైవర్లకు మేలు చేస్తామని, నెలకు వెయ్యి రూపాయలు ఇచ్చే విషయాన్ని, దాంతో పాటు ఇంకా సాయం పెంపు విషయం పరిశీలిస్తున్నామని తెలిపారు. వీటితోపాటు, ఆటో డ్రైవర్లకు ప్రావిడెంట్ ఫండ్ చెల్లించే అంశాన్ని, ఫిట్‌మెంట్ చార్జీల విషయంలోనూ అధ్యయనం చేస్తున్నామన్నారు. మైనారిటీ, బీసీలు ఉంటే మైనార్టీ బంధు, బీసీ బంధు లాంటి పథకాల్లో ఆటో కొనుగోలు సమయంలో సగం ప్రభుత్వం చెల్లించే విషయాన్ని పరిశీలించే ఆలోచన ఉందన్నారు. కార్మిక, రవాణా శాఖలు సంయుక్తంగా ఆటో డ్రైవర్ల సమస్యకు పరిష్కార మార్గాన్ని పరిశీలిస్తున్నాయన్నారు. సమావేశంలో ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, కాంగ్రెస్ కోరుట్ల ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు, మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ విజయలక్ష్మి, కాంగ్రెస్ పార్టీ నాయకులు బండ శంకర్ పాల్గొన్నారు.

జిల్లా ప్రధాన కార్యదర్శిగా రమేశ్

మల్లాపూర్, డిసెంబర్ 19: కాంగ్రెస్ పార్టీ కిసాన్ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా పాతదాంరాజ్‌పల్లి గ్రామానికి చెందిన గజ్జి రమేశ్ నియమితులయ్యారు. ఈ మేరకు సంబంధిత నియామక పత్రాన్ని మంగళవారం కిసాన్ సెల్ విభాగం జిల్లా అధ్యక్షుడు వాకిటి సత్యంరెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు కొమ్ముల చిన్నారెడ్డి అందజేశారు. ఇక్కడ నాయకుడు ఇప్పపల్లి గణేశ్, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ విప్ అడ్లూరికి శుభాకాంక్షలు

జగిత్యాల, డిసెంబర్ 19: ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌ను తెలంగాణ ప్రజాసంఘాల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు పేట భాస్కర్ కోరుట్ల నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావుతో మంగళవారం జిల్లా కేంద్రంలో మర్యాదపూర్వకంగా కలిశారు. అడ్లూరి విప్‌గా నియామకం కావడంపై శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లాలోని పలు అంశాలపై చర్చించినట్లు పేట భాస్కర్ తెలిపారు. వారితో పాటు పార్టీ నాయకులు సంతోష్ రావు, జేఏసీ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ చెవులమద్ది వినోద్, శనిగారపు రాజేశ్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి గణిత సదస్సుకు ఉపాధ్యాయుడి ఎంపిక

అభయ్‌రాజ్

రాయికల్, డిసెంబర్ 19: రాష్ట్రస్థాయి గణిత సదస్సుకు రాయికల్ మండలం రామారావుపల్లె ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కడకుంట్ల అభయ్‌రాజ్ ఎంపికైనట్లు మండల విద్యాధికారి గంగాధర్ తెలిపారు. డిసెంబర్ 22న జాతీయ గణిత దినోత్సవం సందర్భంగా తెలంగాణ విద్యా పరిశోధన, శిక్షణా సంస్థ నిర్వహించే రాష్ట్ర స్థాయి గణిత సదస్సుకు అభయ్ రాజ్ 'ఆధునిక ప్రపంచ నిర్మాణం కోసం విద్యార్థులను శక్తివంతంగా రూపొందించడం లో గణితం యొక్క పాత్ర' నేపథ్యంలో ఆటల ద్వారా అభ్యసనం అనే అంశంపై రూపొందించిన పరిశోధన పత్రం ఎంపికైనట్లు అయన తెలిపారు. ఈ సందర్భంగా అభయ్ రాజ్‌ను జిల్లా విద్యాశాఖాధికారి జగన్మోహన్ రెడ్డి, జిల్లా సైన్స్ అధికారి బాజోజి శ్రీనివాస్, మండల విద్యాధికారి గంగాధర్, పాఠశాల సముదాయ ప్రధానోపాధ్యాయుడు కాపు శ్రీనివాస్, పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు అమర్నాథ్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి ఆనందరావు, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు పొన్నం రమేశ్, మండల అధ్యక్షుడు రాపర్తి నర్సయ్య, ప్రధాన కార్యదర్శి తాటిపాముల రమేశ్, ఉపాధ్యాయులు అభినందించారు.

అప్పుల బాధ భరించలేక యువకుడి ఆత్మహత్య

ఇబ్రహీంపట్నం, డిసెంబర్ 19: అప్పుల బాధ భరించలేక డబ్బ గ్రామానికి చెందిన పున్నం శ్రీనివాస్ (33) ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్ఐ ఉమాసాగర్ మంగళవారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. డబ్బ గ్రామానికి చెందిన పున్నం శ్రీనివాస్‌కు నాలుగు నెలల క్రితం బాబు జన్మించాడు. పుట్టిన బాబుకు ఆరోగ్యం బాగా లేకపోవడంతో మూడు రోజులకే ఆపరేషన్ చేయించగా రూ.3 నుంచి 4లక్షల అప్పు అయింది. అయినా బాబు ఆరోగ్యం బాగుకాకపోవడంతో చేసిన అప్పులు ఎలా తీర్చాలని మనస్తాపం చెంది సోమవారం భార్య హర్షిణి, బాబును తన అత్తగారింటికి పంపించాడు. ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్ఐ వివరించారు. శ్రీనివాస్ భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

బహిరంగ ప్రకటన

ఇందుమూలముగా సమస్త ప్రజలకు తెలియజేయునది ఏమనగా నా యొక్క క్లయింట్ శ్రీమతి పిప్పరి @ వడ్ల సుశీల w/o నారాయణ, గ్రా|| ఆత్మకూర్, మం|| గొల్లపల్లి, జి|| జగిత్యాల ప్రస్తుత నివాసం: గ్రా|| చిట్టాపూర్, మం|| మల్లాపూర్, జి|| జగిత్యాల వాసిని. నాకు ఆత్మకూర్ గ్రామ శివారులో సర్వే నెం: 83, విస్తీర్ణం 8 గుంటల భూమి మరియు సర్వే నెం: 744, విస్తీర్ణం 4 1/2 గుంటలు, మరియు సర్వే నెం: 746, విస్తీర్ణం: 3 1/2 గుంటల భూమి నా భర్త పిప్పరి @ వడ్ల నారాయణ పేరు మీద కలదు. ఇట్టి భూముల పైన మొదట అదనపు జూనియర్ సివిల్ జడ్జ్ జగిత్యాల గారి కోర్టులో కేసు నెం: O.S. 346/2023 in I.A.No. 285/2023 పెండింగ్‌లో ఉన్నది. ఇట్టి పై సర్వే నెంబర్లు గల భూములను పిప్పరి @ వడ్ల లక్ష్మి w/o పిప్పరి అంజయ్య (Late) మరియు పిప్పరి @ వడ్ల సాయి S/o అంజయ్య అనువారు అమ్ముటాని చూస్తున్నారు. ఇట్టి పై సివిల్ కేసు కోర్టులో పెండింగ్ ఉన్నది

కావున పైన తెలిపిన భూములను ఎవరైన కొనుగోలు చేసినచో అట్టి కొనుగోలు లావాదేవీలు జరిగినా చెల్లనేరవు. కావున అట్టి సర్వే నెంబర్లు గల భూములను కొనుగోలు చేయాలని ప్రయత్నించిన వారిపైన చట్టరీత్యా క్రిమినల్ మరియు సివిల్ కేసులు చేయడం జరుగుతుందని తెలియజేయడమైనది.

ఇట్లు: సం/- **చిత్తారి మల్లయ్య**, న్యాయవాది
జగిత్యాల. సెల్: 9440003188

చింతలపేటలో రేణుకా ఎల్లమ్మ బోనాలు

మెట్‌పల్లి రూరల్, డిసెంబర్ 16: చింతలపేట గ్రామంలో రేణుకా ఎల్లమ్మ బోనాల వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక గీత కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఐదు రోజులుగా జరుగుతున్న రేణుకా ఎల్లమ్మ ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాల్లో భాగంగా చివరి రోజు అమ్మవారికి బోనాలు సమర్పించారు. డప్పుచప్పుళ్లు, పోతురాజుల విన్యాసాలుతో ఊరేగింపుగా ఆలయానికి చేరుకొని బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. గీత కార్మిక సంఘం సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఇష్టంతో చదవాలి

- ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కల్వకుంట్ల

ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు నోటు పుస్తకాలను అందజేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కల్వకుంట్ల

ఇబ్రహీంపట్నం, డిసెంబర్ 19: విద్యార్థులు ఇష్టపడి చదివినప్పుడే మంచి ఫలితాలను సాధిస్తారని ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కల్వకుంట్ల అన్నారు. మంగళవారం మండలకేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు స్టడీ మెటీరియల్‌ను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విద్యార్థులు ఇష్టపడి చదివినప్పుడే మంచి ఫలితాలను సాధిస్తారని, అలాగే ఆసక్తి ఉన్న రంగాన్ని ఎంచుకోవాలని సూచించారు. విద్యార్థులు సోషల్ మీడియాను జాగ్రత్తగా వాడాలని సూచించారు. పాఠశాలలో ఏ సమస్యలు ఉన్నా తన దృష్టికి తీసుక రావాలని, పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. ఉపాధ్యాయులు ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కల్వకుంట్లను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో సర్పంచ్ నేమూరి లత, వైస్ ఎంపీపీ లక్ష్మారెడ్డి, ఎంపీటీసీలు రాములు, చిన్నారెడ్డి, ఇన్‌చార్జి మండల విద్యాధికారి ఆనంద్‌రావు, ప్రధానోపాధ్యాయుడు రాజన్న, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీరాజ్ శాఖ అధికారులతో ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కల్వకుంట్ల సమీక్షా

కోరుట్ల, డిసెంబర్ 19: పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మంగళవారం పంచాయతీ రాజ్ శాఖ అధికారులతో ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కల్వకుంట్ల సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పంచాయతీ రాజ్ శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన వివిధ పథకాల పనుల పురోగతిపై ఎమ్మెల్యే వివరాలు అడిగి తెలుసుకున్నారు. పెండింగ్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. అనంతరం పంచాయతీ రాజ్ శాఖ అధికారులు ఎమ్మెల్యేకు పుష్పగుచ్ఛం అందించి సత్కరించారు. పట్టణానికి చెందిన గంగపుత్ర సంఘం సభ్యులు ఎమ్మెల్యేను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. తాళ్లచెరువు గంగమ్మ దేవాలయ వార్షికోత్సవానికి హాజ రు కావాలని ఆహ్వాన పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో పంచాయతీ రాజ్ శాఖ అధికారులు, గంగపుత్ర సంఘం సభ్యులు, ఆదిత్య, రమేశ్, గంగాధర్, బీఆర్ఎస్ పట్టణాధ్యక్షుడు అన్నం అనిల్ పాల్గొన్నారు.

బీఆర్ఎస్ కార్యకర్త కుటుంబానికి ఎమ్మెల్యే పరామర్శ

మెట్‌పల్లి రూరల్, డిసెంబర్ 16: మేడిపల్లి గ్రామానికి చెందిన బీఆర్ఎస్ కార్యకర్త కుటుంబాన్ని కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ పరామర్శించారు. మేడిపల్లికి చెందిన బీఆర్ఎస్ కార్యకర్త మాదునూరి అంజయ్య అనారోగ్యంతో చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మృతిచెందాడు. మంగళవారం మేడిపల్లిలో అంత్యక్రియలు నిర్వహించగా, అంజయ్య పార్థివదేహానికి ఎమ్మెల్యే పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను ఓదార్చి అండగా ఉంటానని ధైర్యం చెప్పారు. ఎమ్మెల్యే వెంట సర్పంచ్ పీసు తిరుపతిరెడ్డి, కార్యకర్తలున్నారు.

ఎమ్మెల్యే సంజయ్ కల్వకుంట్లకు సన్మానం

మెట్‌పల్లి, డిసెంబర్ 18: కోరుట్ల ఎమ్మెల్యేగా ఎన్నికైన డాక్టర్ సంజయ్ కల్వకుంట్లను మెట్‌పల్లి మున్సిపల్ కార్మిక సంఘం ఆధ్వర్యంలో కార్మికులు మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. శాలువాతో సత్కరించి, పెన్నులు, బుక్కులు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.. ఇక్కడ కార్మిక సంఘం అధ్యక్షులు బర్ల లక్ష్మణ్, లంక శ్రీకాంత్, యామ చిన్నయ్య, నర్సయ్య, పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

జడ్పీ సీఈవోకు శుభాకాంక్షలు

రఘువరన్‌కు పుష్పగుచ్ఛాన్ని అందిస్తున్న దావ వసంత

జగిత్యాల, డిసెంబర్ 19: జడ్పీ సీఈవోగా బాధ్యతలు చేపట్టిన రఘువరన్‌కు జడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత శుభాకాంక్షలు తెలిపారు. బాధ్యతలు తీసుకున్న రఘువరన్‌ను ఆమె మంగళవారం కలిశారు. గతంలో జడ్పీ ఇన్‌చార్జి సీఈవోగా పనిచేసిన నరేశ్ జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ పీడీగా పూర్తి బాధ్యతలు చేపట్టడంతో దావ వసంత నరేశ్‌ను అభినందించారు.

కొండగట్టు ఆలయ ఈవోపై కలెక్టర్‌కు ఫిర్యాదు

మల్యాల, డిసెంబర్ 19: కొండగట్టు శ్రీ ఆంజనేయస్వామి ఆలయంలో భక్తులకు సౌకర్యాలు కల్పించడంలో ఈవో నిర్లక్ష్యం వహిస్తున్నారని, సదరు అధికారిపై చర్యలు తీసుకోవాలంటూ జిల్లా కలెక్టర్‌కు సమాచార హక్కు చట్టం–2005 జిల్లా శాఖ అధ్యక్షుడు అక్కినపెల్లి రవీందర్ ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా కొండగట్టు అంజన్న ఆలయ పరిధిలో దుకాణాల సముదాయాలు హక్కులు గల వ్యక్తులు భక్తుల వద్ద నుంచి అధిక మొత్తాలను వసూలు చేస్తున్నారని ఫిర్యాదు చేయడానికి వెళితే అందుబాటులో ఉండడంలేదని, శాఖాపరమైన నంబర్‌కు ఎన్ని సార్లు ఫోన్ చేసినా సమాధానం ఇవ్వలేదన్నారు. ఈ విషయమై దేవాదాయ ధర్మాదాయశాఖ కమిషనర్‌కు సైతం ఫిర్యాదు చేస్తామని, భక్తులు సత్వర ప్రయోజనాలు పొందాలంటే జిల్లా యంత్రాంగం తరపున చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో పేర్కొన్నామన్నారు.

ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్‌కు అభినందనలు

ఎమ్మెల్యేకు పుష్ప గుచ్ఛం అందిస్తున్న డీఈవో జగన్మోహన్‌రెడ్డి

జగిత్యాల టౌన్, డిసెంబర్ 19: జిల్లా కేంద్రంలోని క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్‌ను జిల్లా విద్యాధికారి జగన్మోహన్‌రెడ్డి, అంగన్ వాడీ సూపర్‌వైజర్లు, పట్టణ ఫ్రూట్ వెండర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు మర్యాద పూర్వకంగా కలిశారు. సంజయ్ కుమార్ రెండవసారి ఎమ్మెల్యేగా ఎన్నిక కావడంపై హర్షం వ్యక్తం చేస్తూ పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ మాట్లాడుతూ, బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అభివృద్ధే తన గెలుపునకు కారణమన్నారు. తనను గెలిపించిన ప్రజల వెన్నంటి ఉంటానన్నారు. కార్యక్రమంలో ఫ్రూట్ వెండర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కార్యవర్గ సభ్యులు ఏఎంసీ వైస్ చైర్మన్ ఆసిఫ్, అధ్యక్షుడు ఇమ్రాన్, సభ్యులు సమీర్, అల్తాఫ్, సలీం, యూజైర్, షఫిక్, మోసిన్, యాసిన్, ఆరిఫ్ తదితరులు పాల్గొన్నారు.

సారంగాపూర్ : సారంగాపూర్ తహసీల్దార్‌గా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన రమేశ్ మంగళవారం జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్‌ను క్యాంపు కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సంజయ్ కుమార్ తహసీల్దార్‌ను అభినందించారు.

యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండాలి

- సైబర్‌క్రైమ్ డీఎస్పీ రంగారెడ్డి

మాట్లాడుతున్న సైబర్‌క్రైమ్ డీఎస్పీ రంగారెడ్డి

జగిత్యాల అర్బన్, డిసెంబర్ 19: యువత, విద్యార్థులు మత్తు పదార్థాలకు బానిసలు కాకుండా ఉన్నత లక్ష్యాలను సాధించాలని సైబర్ క్రైమ్ డీఎస్పీ రంగారెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని మెడికల్ కాలేజీలో జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు పోలీస్ శాఖ ఆధ్వర్యంలో డ్రగ్స్, క్రైమ్, ర్యాగింగ్, సైబర్ అబ్‌యూజ్ అండ్ మిస్‌యూజ్ అనే అంశాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఆధునిక సాంకేతిక యుగంలో యువత పోటీతత్వంతో ఉండాలి కానీ, చెడు అలవాట్లకు బానిసలు కావద్దన్నారు. సామాజిక మాధ్యమాల వినియోగంలో చాలా జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ఫొటోలు, వీడియోలు పోస్ట్ చేసే సమయంలో వ్యక్తిగత భద్రతకు సంబంధించిన అన్ని రకాల చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు, డాక్టర్స్ ప్రగతి, సమీర్, ఏవోలు రవీంద్రసింగ్, సంజీవ్, హెచ్‌ఈవో రత్నాకర్‌రావు, షీటీం సభ్యులు, కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రజారోగ్యమే ధ్యేయంగా పనిచేయాలి

- కొవిడ్ కొత్త వెరియంట్ కేసులపై అప్రమత్తంగా ఉండాలి
- జడ్పీ చైర్ పర్సన్ దావ వసంత

మాట్లాడుతున్న దావ వసంత

జగిత్యాల, డిసెంబర్ 19: ప్రజల ఆరోగ్యమే ధ్యేయంగా అధికారులు పని చేయాలని జడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత అన్నారు. జిల్లా ప్రజా పరిషత్ కార్యాలయంలో కొవిడ్ కొత్త కేసులపై జిల్లా స్థాయి అధికారులతో దావ వసంత సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె అధికారులకు పలు సూచనలు చేశారు. ప్రతి గ్రామంలో పారిశుధ్య పనులు నిరంతరం జరిగేలా చూడాలన్నారు. పల్లె ప్రగతి ద్వారా గత కరోనా సమయంలో పల్లెల్లో కరోనాను కట్టడి చేయగలిగామని, అదే తరహాలో కరోనాను కట్టడి చేయాలని అధికారులకు సూచించారు. జిల్లాలోని ప్రతి గ్రామంలో ఆశ కార్యకర్తలు, ఏఎన్ఎంలతో ప్రజలకు ఆరోగ్యంపై అవగాహన సదస్సులు ఏర్పాటు చేయాలని డీఎం అండ్‌హెచ్‌వోని ఆదేశించారు. శ్వాసకోశ సమస్యలు, వృద్ధులు, అనారోగ్య సమస్యలు ఉన్న వారిపై మరింత అప్రమత్తంగా ఉండాలన్నారు. రాబోయే పండుగ సీజన్లలో ప్రజలందరూ ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సీఈవో నరేశ్, డిప్యూటీ సీఈవో రఘువరన్, డీఎంఅండ్‌హెచ్‌వో పుప్పాల శ్రీధర్, డీపీవో దేవరాజ్ తదితరులు పాల్గొన్నారు.

సదరం సర్టిఫికెట్లు అందిస్తాం



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ షేక్ యాస్మిన్ బాషా

జగిత్యాల టౌన్, డిసెంబర్ 19: దివ్యాంగుల సమస్యల పరిష్కారానికి సత్వర చర్యలు తీసుకుంటామని, సదరం క్యాంపులు నిర్వహించి సర్టిఫికెట్లు అందిస్తామని కలెక్టర్ షేక్ యాస్మిన్ బాషా అన్నారు. మంగళవారం ఐడీవోసీ సమావేశ మందిరంలో దివ్యాంగుల సమస్యలపై అధికారులతో జిల్లా స్థాయి సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, సదరం సర్టిఫికెట్ల కోసం క్యాంపులను నిర్వహిస్తామని, ఆయా క్యాంపులు నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లు, కంప్యూటరీకరణకు సిబ్బందిని నియమిస్తామని సంబంధిత అధికారులకు సూచించారు. దివ్యాంగులకు అవసరమైన సహకారం అందిస్తామని, లబ్ధిదారులకు మంజూరైన బ్యాటరీ సైకిళ్లకు అవసరమైన ఉపకరణాలు అందుబాటులో ఉంచడానికి అవసరమైన చర్యలు, నిధులు సమకూర్చుతామన్నారు. సమావేశంలో డీడబ్ల్యూవో భాస్కర్, డీఆర్డీవో నరేశ్, డీఈవో జగన్మోహన్‌రెడ్డి, ఎల్‌డీఎం వెంకట్‌రెడ్డి, అదనపు డీఆర్డీవో సుధీర్, వివిధ సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పల్లెల అభివృద్ధిపై దృష్టిపెట్టాలి

- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్
- అధికారులతో సమావేశం



మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

జగిత్యాల టౌన్, డిసెంబరు 19: పల్లెల అభివృద్ధిపై దృష్టిపెట్టాలని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అధికారులకు సూచించారు. మంగళవారం జగిత్యాల సమీకృత కలెక్టరేట్‌లో భీమారం, మేడిపల్లి, కథలాపూర్ మండలాల్లో సాగు నీరు, రోడ్లు, భవనాలు, పంచాయతీ, రెవెన్యూ తదితర శాఖల ద్వారా చేపడుతున్న కార్యక్రమాలపై జిల్లా కలెక్టర్‌తో కలిసి సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాగు నీటి ప్రాజెక్టులు, ఆనకట్టల నిర్మాణాలు పెండింగ్‌లో ఉన్న పనుల వివరాలు, పురోగతి, కావాల్సిన నిధులపై నీటిపారుదలశాఖ ఇంజినీరింగ్ అధికారులతో చర్చించారు. వానకాలంలో తెగిపోయిన చెరువుల పునరుద్ధరణ, ఆర్‌అండ్‌బీ ద్వారా మంజూరైన రోడ్ల పనుల పురోగతిని అడిగితెలుసుకున్నారు. కలెక్టర్ షేక్ యాస్మిన్ భాష మాట్లాడుతూ వివిధ పథకాలకు లబ్ధిదారులను గ్రామసభల ద్వారా ఎంపిక చేస్తామని చెప్పారు. సమావేశంలో కోరుట్ల ఆర్డీవో రాజేశ్వర్, సాగునీరు, ఆర్‌అండ్‌బీ, పీఆర్ ఇంజినీర్లు పాల్గొన్నారు. కాగా, కలెక్టర్ కార్యాలయ ఆవరణలో రాష్ట్ర స్థాయి కరాటే పోటీల బ్రోచర్‌ను ఎమ్మెల్యే ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ క్రీడల అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యమిస్తుందని చెప్పారు.

అంజన్న ఆలయంలో భక్తుల రద్దీ

మల్యాల, డిసెంబర్ 19: కొండగట్టు శ్రీ ఆంజనేయస్వామి సన్నిధిలో మంగళవారం భక్తుల రద్దీ నెలకొంది. మంగళవారం వేకువజాము నుంచే భక్తులు క్యూలో వెళ్లి స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ చైర్మన్ మారుతీస్వామి, ఈవో టంకశాల వెంకటేశ్ భక్తులకు ఇబ్బందులు కలుగకుండా తగిన ఏర్పాట్లు చేశారు. కార్యక్రమంలో ఆలయ ఏఈవో బుద్ధి శ్రీనివాస్, పర్యవేక్షకులు శ్రీనివాసశర్మ, సునీల్, ఆలయ ఇన్‌స్పెక్టర్లు లక్ష్మారెడ్డి, సంపత్, లక్ష్మీరాజం, ఏఎస్ఐ చిలుక శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

దర్శనం కోసం క్యూలో భక్తులు

అతిథి అధ్యాపక పోస్ట్ భర్తీకి దరఖాస్తులు

కోరుట్ల, డిసెంబర్ 19: పట్టణంలోని ఏస్కొనిగుట్ట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఖాళీగా ఉన్న రసాయన శాస్త్రం అతిథి అధ్యాపక పోస్ట్ భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ నీలి వాసవి ఒక ప్రకటనలో మంగళవారం తెలిపారు. పీజీ అభ్యర్థులు జనరల్, ఓబీసీకి 55 శాతం మార్కులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు 50 శాతం మార్కులు సాధించిన వారు అర్హులన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈనెల 21వ తేదీలోగా కళాశాలలో దరఖాస్తులు అందించాలని సూచించారు. పీహెచ్‌డీ నెట్, సెట్ అభ్యర్థులకు ఎంపికలో ప్రాధాన్యత ఇస్తామని ప్రిన్సిపాల్ తెలిపారు. వివరాలకు 94907 83040 సెల్ నంబర్‌లో సంప్రదించవచ్చన్నారు.

22న జిల్లా కేంద్రంలో జాబ్ మేళా

జగిత్యాల రూరల్, డిసెంబర్ 19: జిల్లాలోని నిరుద్యోగ యువతీ యువకులకు శ్రీ విజయ బయోఫర్టిలైజర్ హైదరాబాద్, కృషి విజ్ఞాన్ ఫర్టిలైజర్ హైదరాబాద్ కంపెనీల్లో సేల్స్ రిప్రజెంటీవ్స్ పోస్టుల భర్తీకి జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పన అధికారి సత్తమ్మ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల వారు ఈనెల 22న ఉదయం 11 గంటలకు జగిత్యాలలోని జిల్లా ఉపాధి కల్పన కార్యాలయంలో నిర్వహించే జాబ్ మేళాలో పాల్గొనాలని పేర్కొన్నారు. 18 నుంచి 40 సంవత్సరాల వయసు కలిగి డిగ్రీ విద్యార్హత గల వారు అర్హులని పేర్కొన్నారు. ఎంపికైన అభ్యర్థులు జగిత్యాల, కోరుట్ల, మెట్‌పల్లితో పాటు కరీంగర్, ఆదిలాబాద్, నిర్మల్ జిల్లాల్లో పని చేయాల్సి ఉంటుందన్నా రు. వేతనం రూ.10 వేల నుంచి రూ.18వేల వరకు ఉంటుందన్నారు. ఆసక్తి గల వారు జాబ్‌మేళాలో పాల్గొనాలని సూచించారు.

ఘనంగా దత్త పారాయణం ప్రారంభం

జగిత్యాల, డిసెంబర్ 19: జిల్లా కేంద్రంలోని శ్రీ భక్తమార్కండేయ దేవాలయం, శ్రీ షిర్డీ సాయిబాబా దేవాలయంలో దత్త జయంతి పురస్కరించుకొని దత్త పారాయణ సప్తాహాన్ని ప్రారంభించారు. ప్రత్యేకంగా అలంకరించిన వేదికపై ఉత్సవ విగ్రహాలను ప్రతిష్ఠించి, విశేష పూజలు చేశారు. వేద పండితులు బ్రహ్మశ్రీ తిగుళ్ల విషుశర్మ, శ్రీనివాస్ శర్మ, గోపాలకృష్ణ, ఆలయ అర్చకులు వేనయ్య ప్రత్యేక పూజలు చేశారు. ఆయా కార్యక్రమాల్లో పద్మశాలీ సేవా సంఘం అధ్యక్షుడు గౌరి శ్రీనివాస్, తాటిపాముల వినోద్ కుమార్ సాయిబాబా దేవాలయం అధ్యక్షుడు సతీశ్ కుమార్, నాగుల కిషన్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

రైస్‌మిల్లు కాలుష్యంపై పరిశీలన

రాయికల్, డిసెంబర్ 19: పట్టణంలోని పదో వార్డులో జనావాసాల మధ్య ఉన్న రైస్ మిల్లువల్ల చుట్టుపక్క ప్రజలకు ఇబ్బందులు తలెత్తుతున్నాయని, రైస్‌మిల్లు కాలుష్యంపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ప్రజలు ఇటీవలే అధికారులకు ఫిర్యాదు చేశారు. కాగా కాలుష్య నివారణ మండలి ఇంజినీర్ భిక్షపతి, సహాయక పర్యావరణ ఇంజినీర్ వీరేశ్ మంగళవారం రైస్ మిల్లును పరిశీలించి విచారణ చేపట్టారు.

లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలి

మెట్‌పల్లి, డిసెంబర్ 19 : ఈ నెల 30 జరిగే లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలని మెట్‌పల్లి జూనియర్ సివిల్ కోర్టు మెజిస్ట్రేట్ అరుణ్‌కుమార్ అన్నారు. మంగళవారం కోర్టు హాల్‌లో మండల లీగల్ సర్వీసెస్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, మెట్‌పల్లి, కోరుట్ల డివిజన్ల పరిధిలో వివిధ కేసులకు సంబంధించి రాజీకుదర్చడానికి కృషి చేయాలని సూచించారు. సమావేశంలో ఏపీపీ మాధవి, బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు ఒజ్జెల శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి తెడ్డు ఆనంద్, సీఐ లక్ష్మీనారాయణ, న్యాయవాదులు పాల్గొన్నారు.

ఐతుపల్లిలో ముందస్తు క్రిస్మస్ వేడుకలు

పెగడపల్లి, డిసెంబర్ 19: ఐతుపల్లి గ్రామంలో మంగళవారం ముందస్తు క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. వేడుకలకు ముఖ్య అతిథిగా గోదావరిఖని జడ్జి టీ శ్రీనివాసరావు హాజరయ్యారు. ఈ సందర్భంగా తడగొండ పెద్దకాంతయ్య స్మారకార్థం పలువురు పేదలకు జిల్లా జడ్జి దుస్తులు పంపిణీ చేసి, కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు తడగొండ సత్యరాజ్‌వర్మ, మార్కెట్ డైరెక్టర్ తడగొండ సాగర్, చర్చి పాస్టర్ తడగొండ పీటర్, సంఘ కాపరి దేవదత్తం, సభ్యులు డేవిడ్, జకర్య, సంటి పెద్దబాబు, జయరాజ్ తదితరులున్నారు.

గ్రామాలకు చేరిన స్వామి వారి అక్షింతలు

కొడిమ్యాల, డిసెంబర్ 19: మండల కేంద్రంలో మంగళవారం గ్రామ నాయకులు అయోధ్య నుంచి వచ్చిన అక్షింతలను ఇంటింటికీ తిరుగుతు ప్రజలకు అందజేశారు. కార్యక్రమంలో గ్రామ నాయకులు చెన్న దేవేందర్, బోగ రాకేశ్ తదితరులు పాల్గొన్నారు.

మల్యాల, డిసెంబర్ 19: అయోధ్య రామమందిర ప్రాణప్రతిష్ఠ అక్షింతలు మండలానికి మంగళవారం చేరుకున్నాయి. దీంతో మండలకేంద్రంలోని మఠమాంజనేయస్వామి ఆలయానికి అక్షింతలను అయ్యప్ప మాలధారులు శోభాయాత్రగా తీసుకెళ్లారు. కార్యక్రమంలో దీక్షాపరులు, సేవకులు పాల్గొన్నారు.

పెగడపల్లి, డిసెంబర్ 19: అయోధ్యలోని శ్రీ సీతారామలయానికి చెందిన తలంబ్రాలు మంగళవారం మండల కేంద్రంలోని స్వయంభూ శ్రీరాజరాజేశ్వరస్వామి ఆలయానికి చేరుకున్నాయి. కార్యక్రమంలో బీజేపీ మండలాధ్యక్షుడు గంగుల కొమురెల్లి పార్టీ నాయకులు, ఆలయ కమిటీ సభ్యులు భూమాడి గంగారెడ్డి, మ్యాకల మల్లేశ్‌యాదవ్, పెద్ది రమేశ్, తదితరులున్నారు.

ఇంధన పరిరక్షణ వారోత్సవాలు

కోరుట్ల, డిసెంబర్ 19: పట్టణంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో మంగళవారం జాతీయ ఇంధన పరిరక్షణ వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలోని వివేకానంద ఎనర్జీక్లబ్ ఆధ్వర్యంలో విద్యార్థులతో ఇంధన పొదుపు గురించి ప్రజలకు అవగాహన కల్పిస్తూ ర్యాలీ తీశారు. విద్యార్థులకు చిత్ర లేఖనం పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఎంఈవో గంగుల నరేశం, ప్రధానోపాధ్యాయుడు గడెల భూపతి, ఎనర్జీ కో ఆర్డినేటర్ చందనాగరాజు, సంతోష్‌కుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పాఠశాలలో వికసిత్ సంకల్ప్ యాత్ర

జగిత్యాల టౌన్, డిసెంబరు 19: జిల్లా కేంద్రంలోని మోతెవాడ పాఠశాలలో మంగళశారం శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో వికసిత్ సంకల్ప్ యాత్ర నిర్వహించారు. కార్యక్రమంలో సీడీపీవో వీరలక్ష్మి, మున్సిపల్ కమిషనర్ అనిల్‌బాబు, మున్సిపల్ డీఈ రాజేశ్వర్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రాణి, అంగన్‌వాడీ టీచర్లు కళావతి, అరుణ, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నూతన నియామకం

కోరుట్ల రూరల్, డిసెంబర్ 19: కోరుట్ల మండల కాంగ్రెస్ పార్టీ నూతన కార్యవర్గాన్ని నియోజకవర్గ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు నియమించారు. మండల జనరల్ సెక్రటరీగా ఎండీ జలీల్, సర్ఫరాజ్‌పూర్ గ్రామశాఖ అధ్యక్షుడిగా తోట నర్సయ్యను నియమించారు. కార్యక్రమంలో పార్టీ మండలాధ్యక్షుడు తిరుమల గంగాధర్, నర్సయ్య, లక్ష్మణ్, ఎండీ రఫీయొద్దీన్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ వినియోగదారుల పరిష్కార వేదిక

కోరుట్ల, డిసెంబర్ 19: పట్టణంలోని కల్లూరు రోడ్డు విద్యుత్ సబ్‌స్టేషన్ ఆవరణలో బుధవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదికను నిర్వహిస్తున్నట్లు సీజీఆర్ఎఫ్ అధ్యక్షుడు రామకృష్ణ, పట్టణ ఏడీఈ ఆంజనేయ రావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సద్వినియోగం చేసుకోవాలన్నారు.